# శ్రేయస్సు

## మధురాంతకం రాజారాం

పండు చలికాలం. తెల్లవారుజామున అయిదు గంటలై వుంటుంది. నిండుగా ఓ శాలువా ముసుగెట్టుకుని బయల్దేరడానికి సిద్ధంగా వున్న బస్సెక్కాను. ఖాకీ దుస్తులకు తోడు, తలచుట్టూ ఒక మఫ్లరుగూడా బిగించి ఎస్కిమోవాడిలా వున్న కండక్టరు చేతికి డబ్బిచ్చి టిక్కెట్టు తీసుకున్నాను. వెళ్ళి వెనకసీట్లో కూచున్నానేమో: కాసేపటికల్లా వెచ్చగా నిద్ర పట్టింది. సూర్యోదయమైన తర్వాత ఏ పదుగంటల ప్రాంతంలోనో హఠాత్తుగా మేలుకున్నాను. గొంతు చించుకుంటూ ఎవరో కారు బారు నేసేస్తున్నారు

"ఆగమన్నచోట ఆగదు. దించమన్నచోట దించదు. ఏమార్టీసీవాళ్ళయ్యా మీరు? తీసుకెళ్ళి సుబ్బరంగా ఏ గోదారిలోనో దించేస్తారు!" అంటూ ఓ పల్లెటూరాయన చికాకుపడిపోతున్నాడు.

"వాళ్ళదంతా ఇష్టారాజ్యమైపోయిందిలెండి! వాళ్ళుండడం ప్రజలకోసం గాదు. నానా అవస్థలూ పడుతూ ప్రజలుండడం వాళ్ళకోసం! ఉలక్కుండా పలక్కుండా అలా గుండ్రాయిలా కూచున్నావేమయ్యా కండక్టరూ! ఆ పెద్దమనిషి ఏదో అడుగుతున్నాడు. జవాబు చెప్పక్కర్లా?" చిన్నసైజు పార్టీ నాయకుడిలాంటివ్యక్తి రంగంలోకి దిగి, నిలదీసి అడుగుతున్నాడు.

కండక్టరు చేతులు పైకెత్తి జోడిస్తూ అన్నాడు—"అయ్యా! మీకు నమస్కారం! గుండ్రాయిని కాబట్టే యింకా బ్రతికున్నాను. మనిషినై వుంటే ఈపాటికెప్పుడో తిరిగి రాని ప్రయాణానికి టిక్కెట్టు పుచ్చుకుని వుందును. ఇది ఫాస్టు ప్యాసెంజరయ్యా బాబూ-అని వెయ్యిసార్లు చెప్పాను. దీనికి ఖరారుగా కొన్ని స్టాపింగులున్నాయి. అంతకుమించి మరెక్కడా ఆగరాదని రూలు...."

అరరే, భ్రమ కాదుగదా! ఈ గొంతుక ఎక్కడో విన్నట్టుంది. ..

"రూలు! ఏం రూలయ్యా, బోడి రూలు...." కండక్టరు నోటినుంచీ వెలువడిన చివరి మాట ఆధారంగా ప్రయాణీకుల్లో మళ్ళీ చర్చ ప్రారంభమైపోయింది.

చిన్న బస్తీలాంటి గ్రామం ఒకటి ఎదురైంది. రచ్చదగ్గర మలుపులో బస్సాగింది. రెండు బళ్ళకు సరిపోయేటన్ని కూరగాయల తట్టలతో అక్కడ దాదాపు యాభై మంది ప్రయాణీకులు బస్సుకోసం వేచివున్నారు.

వాళ్ళు దిగేవాళ్ళను దిగనివ్వలేదు.

'బలం వుంటేనే బ్రతుకు. మేమెక్కుతున్నాం. దిగేవాళ్ళకు దమ్ములుంటే మాతో తలపడొచ్చు' అన్నట్టుగా వాళ్ళు తమతమ బుట్టలతో, తట్టలతో, మూటలతో, సంచులతో లోపలికొచ్చేస్తున్నారు. 'మేము మాత్రం ఏమంత నాజూకు మనుషులమా' అన్నట్టు దిగవలసినవాళ్ళు ఒక ఉప్పెనలా వెళ్ళి వాళ్ళపైన పడ్డారు. సంకుల సమరం... జీవన్మరణ పోరాటం.

"అయ్యా, ఆగండి! బాబూ దయ పెట్టండి! అయ్యలారా, మీకు శతకోటి దండాలు!"—కండక్టరు కేకలతో బాటుగా ఒక తడి ఆకారంగూడా గుంపులో వంకరలు తిరిగింది. గిరికీలు కొట్టింది. 'ఎక్కడ? ఎక్కడ? కండక్టరెక్కడ?' అనుకోవడం వినిపించింది. బస్సులో ఎక్కడివాళ్ళక్కడ సర్దుకునేసరికి రోడ్డుపైన వెల్లకిల పడిన కండక్టరు దుమ్ము దులుపుకుంటూ పైకిలేచి వచ్చాడు.

"బుద్ధుండక్కర్లేదా? నిన్నెవరయ్యా యిక్కడ బస్సాపమన్నది?" డ్రయివరు ఉరిమినట్టుగా అడిగాడు.

"మరిక్కడ స్టాపింగు వుందిగా?"

"అయితే అఘోరించు"

టికెట్లు కొనుక్కోమనీ, తట్టలకు బుట్టలకు లగేజ్ చెల్లించమనీ కండక్టరు ప్రాధేయపడుతున్నాడు. 'పోనీలే చూద్దాం' అన్నట్టుగా ప్రయాణీకులు ఎవరి ధ్యాసలో వాళ్ళు ముభావంగా వుండి పోతున్నారు.

ఇంకొక పదిమైళ్ళు వెళ్ళేసరికి మళ్ళీ ఒక పెద్ద గ్రామం. అక్కడా ఒక జనసందోహం. 'ఆపు, ఆపు' అంటూ ఓ యిరవై మందిదాకా అడ్డంగా చేతులు సాచేశారు.

అప్రమత్తుడైపోయిన కండక్టరు "సీటు లేదు. రైట్, రైట్" అనేశాడు.

వెన్నంటి వస్తున్న జనంలోనుంచి ఏకధాటిగా తిట్లు వినిపిస్తున్నాయి. 'మళ్ళీ ఈదారిలో రావూ? ఎముకలేరేస్తా చూసుకో?'

విసురుగా ఓ రాయి వచ్చి పడినట్టుంది. రేకులపైన 'ఢమీ'ల్మని చప్పుడు.

కండక్టరు వానలో తడిసిన పూరేడి గువ్వలా తన సీట్లో తాను ముడుచుకుపోయాడు.



ఎనిమిదిన్నరకు బస్ గమ్యస్థానం చేరింది. చిట్టచివర క్రిందికిదిగిన వాణ్ణి నేనే నేమో! సర్వమూ పోగొట్టుకుని వచ్చిన కాందిశీకుడిలా అల్లంత దూరాన నిలబడి వున్న కండక్టరు కనిపించాడు.

అతడివైపు పరకాయించి చూశాను, అతడుగూడా ఒకటి రెండు క్షణాలు నావైపలాగే నిశ్చలంగా చూశాడు. ఆ కళ్ళలో ఒక స్మృతిరేఖ తటాలున వెలిగింది—"మేష్టరుగారూ! మీరా! ఈ బస్సులోనే వచ్చారా?" అంటూ దగ్గరగా వచ్చేశాడు.

నాకున్నూ గుర్తొచ్చింది—

"అరరే, నువ్వా నాయనా! మూడేళ్ళ క్రితం....ఎం. ఏ. తెలుగులో .... ర్యాంక్ తెచ్చుకుని...."

"సర్లెండి....ఇప్పుడు మీరు...."

"యం. ఫిల్. చేయడానికి సబ్జక్టుగూడా రిజిష్టరుచేసుకుని...."

"మేష్టరుగారూ! కాఫీ ఏమైనా...."

"ఉండుండు. దేనిపైన నీ రీసెర్చి? ఆధునికాంధ్ర సాహిత్యంలో విశ్వశ్రేయస్సు గదూ?"

"మీకు పుణ్యముంటుంది నాకు దిగులేస్తుంది, ఆమాట మాత్రం నాతో చెప్పొద్దు. మళ్ళీ పదింటికి డ్యూటీవుంది. ఈ ట్రిప్ చిత్తూరు టూ పుత్తూరు; వయా పెనుమూరు, పచ్చికాపాలం, కార్వేటి నగరం, బస్ నంబరు APZ 3029. సెలవు, వెళ్ళొస్తానండి మేష్టరూ!"

## ! స్టాప్ అండ్ ప్రొసీడ్ !

చందాదారులకు, ఏజంట్లకు, వ్యాపార ప్రకటనదారులకు

రచయిత/త్రులకీ, పాఠకులకీ ఓమాట :

చిరునామా ఇకనుంచి 'పోస్ట్‌బాక్స్ నెంబర్'కే రాయండి—

పి. బి. నెం. సౌకర్యం వచ్చింది గనక ఇకమీదట....

పి. బి. నెం. 1824

హైదరాబాదు - 20

అంటే చాలు....